గుంతలరోడ్డుతో అవస్థలు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- డబుల్ రోడ్డుపై ఆశలు ఆవిరి
- రెండు జిల్లాలను కలిపే నాలుగు కిలోమీటర్ల దూరం



గుంతలమయంగా కొత్తపల్లి రోడ్డు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు సైతం పాడవుతున్నాయి. గ్రామ శివారులోని సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేట జిల్లా శిలాజీనగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కలగానే మారింది. ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా స్పందన రావడం లేదు. నాయకులు, గ్రామస్తులు డబుల్ రోడ్డు కావాలని నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తూనే ఉన్నారు. కొత్తపల్లి నుంచి మండలకేంద్రానికి గ్రామస్తులు మహా పాదయాత్ర చేపట్టారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆందోళన చేసేందుకు నాయకులు, గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

ప్రయాణికుల ఇక్కట్లు

కొత్తపల్లి రోడ్డు గుండా సిద్దిపేట జిల్లా శిలాజీనగర్, గంభీర్‌పూర్, చీకోడు, దుబ్బాక, రామక్కపేట, ఆకారం గ్రామాలతో పాటు జిల్లాలోని కొత్తపల్లి, శ్రీగాధ, రాజుపేట, కోళ్లమద్ది, లింగన్నపేట గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఇటు కామారెడ్డి, అటు సిద్దిపేట పట్టణాలకు వెళ్లాలంటే ఇదే రోడ్డు ప్రధానం. సింగిల్ రోడ్డు కావడం, అక్కడక్కడ గుంతలుపడడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

రెండు జిల్లాలను కలిపే రహదారి

రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలను కలిపే ఈ రోడ్డును నాలుగు కిలోమీటర్లు డబుల్ రోడ్డుగా మార్చితే అంతర్‌జిల్లా రహదారిగా మారనుంది. గ్రామానికి అటు వైపు, ఇటు వైపు డబుల్ రోడ్లు ఉన్నాయి. కానీ కొత్తపల్లి గ్రామం మీదు నుంచి నాలుగు కిలోమీటర్లు మాత్రమే డబుల్ రోడ్డు లేదు. కొత్తపల్లికి ఆనుకొని ఉన్న సిద్దిపేట జిల్లా శిలాజీనగర్ వరకు డబుల్ రోడ్డు ఉంది. ఇటు గ్రామ శివారులో నుంచి సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన డబుల్‌రోడ్డు వెళ్తోంది. రెండింటిని అనుసంధానం చేస్తే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

నిత్యం ఇబ్బంది పడుతున్నారు



గ్రామంలోని విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. కానీ స్పందన లేదు. డబుల్ రోడ్డు లేక నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడుతాం.

– గౌటి గణేశ్, కొత్తపల్లి

నిధులు మంజూరుచేయాలి



గత ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తపల్లి గ్రామంపై చిన్నచూపు చూస్తోంది. కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించడం లేదు. మండలంలోనే అతి పెద్ద గ్రామం కొత్తపల్లి. అయినా పట్టించుకోవడం లేదు. ఓట్లప్పుడు రోడ్డు కోసం హామీలు ఇస్తున్నారు. తర్వాత విస్మరిస్తున్నారు. డబుల్ రోడ్డు కోసం నిధులు మంజూరు చేయాలి. గ్రామంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

– పెద్దూరి పర్శరాములుగౌడ్, కొత్తపల్లి



గంభీరావుపేట: మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై కేజీ టు పీజీ విద్యా సంస్థల ఏరియాలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా ఉంది. చాలా ఎత్తుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. అప్రమత్తంగా లేకపోతే వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఎత్తైన స్పీడ్ బ్రేకర్‌ను తొలగించి ప్రత్యామ్నాయ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నరేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, 9440818863

క్లుప్తంగా

రైతుబజార్‌లో మాంసం విక్రయాలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన మటన్ మార్కెట్‌లోనే మాంసం విక్రయాలు చేపట్టాలని ఏఎంపీ చైర్మన్ వ్యాపారులకు సూచించారు. మంగళవారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతబజార్‌లోని మేకలు, గొర్లు కట్ చేసే షెడ్డును జిల్లా వెటర్నటీ అధికారి రవీందర్ రెడ్డితో కలిసి సందర్శించి మాట్లాడారు. రానున్న రోజుల్లో రైతు బజార్‌లోనే మటన్ అమ్మాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డెరెక్టర్లు దుబాల వెంకటేశం, ఖాజా మైనుద్దీన్, ఆడెపు జగన్, నక్క నరసయ్య, తిరుపతిరెడ్డి, పరశరాములు, మహిళా డైరెక్టర్ అనుముల శైలజచ మార్కెట్ కమిటీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ నిబంధనలు విధించాలని, పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయాలను నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేశ్ కోరారు. ఎల్లారెడ్డిపేట ఎంఈవో కృష్ణహరికి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఫ్రీ అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వంశీ, అజయ్, సాయి, కృష్ణ ఉన్నారు.

బాధితులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న మహ్మద్ సర్వర్

ముస్తాబాద్: హైదరాబాద్ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ సర్వర్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మిస్‌వరల్డ్ పోటీలతో అధికార యంత్రాంగం ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ప్రజలు విసిగిపోయారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, సంతోష్‌రావు, భరత్, అన్వర్, ముక్కమల్లయ్య, తాళ్ల రాజు, జహంగీర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష స్థానానికి పోటీ

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండలశాఖతో పాటు గ్రామశాఖల నూతన కార్యవర్గాల ఎన్నిక కోసం మంగళవారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో నామినేషన్ల స్వీకరణ చేపట్టగా స్పందన లభించింది. ఒక్కో గ్రామానికి ఐదుగురు చొప్పున గ్రామశాఖ అధ్యక్షుడిగా పోటీచేయాలని కోరడంతో నామినేషన్లు వేశారు. అయితే మండల అధ్యక్షుడి స్థానానికి మాత్రం పోటీ నెలకొంది. 19 మంది మండల అధ్యక్ష స్థానానికి నామినేషన్ వేయగా వారిలో ప్రస్తుత మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని మళ్లీ మండల అధ్యక్ష స్థానం కోసం నామినేషన్ వేయడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు చైతన్య కృష్ణా రెడ్డి, ఎండి.ఫక్రుద్దీన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసులు కొంతమందికి అండగా ఉంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. రాళ్లపేటకు చెందిన శ్రీనివాస్ గౌడ్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే అక్కసుతో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాలుతో తన్ని దాడిచేశాడని.. ఆదివారం ఉదయం ఫిర్యాదుచేస్తే మూడు రోజులైనా పోలీసులు కేసు కూడా నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, సిరిసిల్ల సింగిల్విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ వెంకట రమణా రెడ్డి, నాయకులు అబ్బాడి అనిల్ రెడ్డి, అంకారపు రవీందర్, నందగిరి భాస్కర్ గౌడ్, జగన్, శ్రీధర్, అనిల్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ సజావుగా సాగాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

తంగళ్లపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పట్టాల పంపిణీ సజావుగా సాగేలా అందరూ సహకరించాలని ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ మంగళవారం అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని 500 మంది ఇందిరమ్మ లబ్ధిదారుల మంజూరు పట్టాలను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా లబ్ధిదారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దొంతుల రమేశ్, ఏపీవో రాజనర్సు, పీఆర్ ఏఈ మహేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్

గంభీరావుపేట: డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం డ్రై డే పాటించాలన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న రెడ్డిమల్ల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ఓ జాతీయ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నెరుపుతున్నారని ఇది సరికాదన్నారు. ఆర్బీఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెడ్డిమల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్బీఐ అడ్డు పెట్టుకుని ఆయన ప్రముఖుల ఆస్తులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకపాక మనోజ్ కుమార్, మునీర్, కూర శ్రీధర్, కాసర్ల పవన్, పంగా మధు, జిందం మహేందర్, వేముల గంగాధర్, రాహుల్, అడిచర్ల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో మంగళవారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ నర్సాగౌడ్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 40 జట్లు పాల్గొంటున్నాయి. మాజీ సర్పంచ్ మాట్లాడుతూ… గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



ఇల్లంతకుంట: రైతులు భూసార మట్టి పరీక్షలు చేయించాలని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ రమేశ్ అన్నారు. ముస్కానిపేటలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వానాకాలం పంటలకు రైతులు ఎలా సమాయత్తం కావాలో వివరించారు. యూరియా మోతాదుకు మించి వాడొద్దన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొని ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ హిందూజ, మండల వ్యవసాయ అధికారి ఎం సురేశ్ రెడ్డి, గోవర్ధన్, ఏఈవోలు గంగా, అర్చన, రవళి, లలిత, అభిషేక్, రైతులు పాల్గొన్నారు.

సెపక్‌టాక్రా... సెస్టోబాల్ పోటీల్లో ప్రతిభ



వేములవాడరూరల్: శ్రీలంకలో ఈనెల 14నుంచి 19 వరకు నిర్వహించిన 2వ సౌత్ ఏషియన్ సెస్టోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత జట్టు రెండో స్థానం సాధించింది. ఈ జట్టులో రాష్ట్రంనుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా చెక్కపల్లికి చెందిన ఎడపెల్లి అనిల్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అనిల్‌ను మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఎదురగట్ల మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, పలువురు అభినందించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

తంగళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని బీఆర్‌టీయూ (భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్) జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా చేస్తోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు రూ.4 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. బండలింగంపల్లికి చెందిన మాచర్ల దేవరాజం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. దేవరాజంపై కేసు నమోదు చేసినట్లు ప్రొబెషనరీ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం జీలుగ విత్తనాలను ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేర బేగం, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ‘అదును లోగా అందేనా..’ అనే శీర్షికన ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు, నాయకులు స్పందించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేర బేగం మాట్లాడుతూ సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ గుండాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు ఆడెపు శోభ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలు లేకుండా చూస్తాం

ఎల్లారెడ్డిపేట: నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈఈ ప్రశాంత్ తెలిపారు. ఇటీవల మండలంలో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డ విషయం తెలిసిందే. దీనిపై ‘వృథాగా భగీరథ నీరు’ అనే శీర్షికన ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఏఈఈ స్పందించారు. లీకేజీలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే సరిచేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

కాలువ పనులను అడ్డుకున్న రైతు


పనులను అడ్డుకుంటున్న రైతు నర్సయ్య

రుద్రంగి: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా చేపట్టిన కాలువ నిర్మాణ పనుల్లో తన భూమి ముంపునకు గురవుతున్నా నష్టపరిహారం చెల్లించలేదని మండల కేంద్రానికి చెందిన రైతు దయ్యాల నర్సయ్య కాలువ పనులను అడ్డుకున్నాడు. సర్వే నెంబర్ 333లో 20 గుంటల భూమికి అధికారులు నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా కాలువ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు నష్టపరిహారం అందించిన తర్వాతే కాలువ పనులు చేపట్టాలని, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

నేడు ఇళ్లపట్టాలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తెలిపారు. లక్ష్మీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


కొమురయ్య (ఫైల్)

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లెకు చెందిన శతాధిక వృద్ధుడు నూనె కొమురయ్య (100) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశాడు. కొమురయ్యకు భార్య లచ్చవ్వ, ఐదుగురు కొడుకులలో ఒకరు మృతి చెందగా నలుగురు కొడుకులు, 9 మంది మనవళ్లు మనవరాళ్లు, 20 మంది వరకు మునిమనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ: ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు చేరవేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బ్లాక్ కాంగ్రెస్ స్థాయి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ… గతంలో అమలవుతున్న కార్యక్రమాలను కొనసాగిస్తూనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 కే గ్యాస్, సన్న వడ్లకు రూ. 500 బోనస్, సన్న బియ్యం పంపిణీ, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కలికోట సూరమ్మ, అప్పర్ మానేరు పనులు పూర్తి చేస్తున్నామన్నారు. రాజన్న ఆశీర్వాదంతో ఆలయం అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధి, పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. భక్తులకు అర్జిత సేవలను దూరం చేయకుండా ఉండేందుకే శృంగేరి పీఠాధిపతుల సూచన మేరకు భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబరాల పోస్టర్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ యూనియన్ ప్రతినిధులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. రజతోత్సవ సభకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్‌పాషా పిలుపునిచ్చారు. ఈనెల 31న 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు జిల్లా నుంచి జర్నలిస్టులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, సామల గట్టు, మహమ్మద్ రఫీ, ప్రసాద్, ప్రవీణ్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌తో జర్నలిస్టులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకం కేంద్రం సందర్శన


పట్టు పురుగుల పెంపకం కేంద్రం ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట: మండలంలోని కోళ్లమద్దిలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. 'పట్టు తప్పింది.. గతమెంతో ఘనం.. ప్రస్తుతం అధ్వాన్నం' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. మంగళవారం క్షేత్రస్థాయిలో కలెక్టర్ కేంద్రంలో ఆవరణలో పెరిగిన మొక్కలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఆవరణలోని స్థితిగతులు, భూములను పరిశీలించారు. పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మల్బరీ సాగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం పరిధిలోని ప్రభుత్వ భూములు, చెట్లు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి లత, అధికారులు లోకేష్, జగన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

● యువకుడి అదృశ్యంపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన కోనేటి శ్రీనివాస్ అనే యువకుడు మంగళవారం అదృశ్యమయ్యాడు. శ్రీనివాస్ భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. స్టేషన్ హౌస్ అధికారి సత్యనారాయణ తెలిపిన వివరాలు.. శ్రీనివాస్ ఈనెల 18న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

● ధాన్యం బస్తాలు చోరీ

ఇల్లంతకుంట: పొత్తూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంనుంచి 30 ధాన్యం బస్తాలు ఎత్తుకెళ్లినట్లు రైతు గోద బీరయ్య పొత్తూరు ఐకేపీ సెంటర్ నిర్వాహకులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. 300 బస్తాలు సోమవారం తూకం వేయగా మంగళవారం 30బస్తాలు కనిపించడం లేదని వాపోయాడు. దీనిపై ఐకేపీ ఏపీఎం కట్ట వాణీశ్రీ ని వివరణ కోరగా నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

● దొంగ రిమాండ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఈరవేణి కావ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్నారు. అతడినుంచి 22 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కావ్య తన ఇంటికి తాళం వేసి తల్లిగారింటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన ఈరవేణి సత్యనారాయణ ఈనెల 16న ఇంటితాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లాడు. కావ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సత్యనారాయణ దొంగలించిన ఆభరణాలను విక్రయించేందుకు కామారెడ్డికి వెళ్తుండగా మంగళవారం రాచర్లగొల్లపల్లి బస్టాండ్‌లో పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

● వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: అక్కపల్లికి చెందిన ఓ మహిళను గాయపరిచిన యువకుడిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ప్రొబెషనరీ ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. సదరు మహిళ తన అక్క ప్రేమ వివాహానికి కారణమంటూ అదే గ్రామానికి చెందిన యువకుడు పొన్నం అజయ్ అసభ్య పదజాలంతో దూషించి, దాడిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

● 5న చలో హైదరాబాద్

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల టీయూఎఫ్ టేబుల్ సమావేశం ఉన్నందున కళాకారులు, రచయితలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. రాములు, కనుకయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

వీర్నపల్లి: మండలంలో ని పలు కొనుగోలు కేంద్రాల్లో కోతులు, అడవిపందులతో ఇబ్బంది పడుతున్నామని వన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. నెలదాటినా కొనుగోలు కేంద్రంలో ధాన్యం అలాగే ఉందని, ఇప్పటికైనా ధాన్యం మిల్లులకు తరలించాలన్నారు.